ఎఫ్ఐహెచ్ అవార్డు రేసులో హర్మన్‌ప్రీత్, శ్రీజేశ్

లాసానే(స్విట్జర్లాండ్): ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్(ఎఫ్ఐహెచ్) అవార్డు రేసులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ పోటీపడుతున్నారు. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకం గెలువడంలో హర్మన్‌ప్రీత్‌తో పాటు శ్రీజేశ్ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా హర్మన్‌ప్రీత్ ఏకంగా 10 గోల్స్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో ఎఫ్ఐహెచ్ మంగళవారం అవార్డుల కుదింపు జాబితాను విడుదల చేసింది. ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రేసు కోసం థియరీ బ్రింక్‌మన్, జోప్ డీ మోల్(నెదర్లాండ్స్), హన్నెస్ ముల్లర్(జర్మనీ), జాచ్ వాలెస్(ఇంగ్లండ్)తో హర్మన్‌ప్రీత్ పోటీలో ఉన్నాడు. మరోవైపు గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాగా పేరొందిన శ్రీజేశ్..గోల్‌కీపర్ అవార్డు కోసం రేసులో ఉన్నాడు. 2024లో జరిగిన అన్ని మ్యాచ్‌ల్లో ప్రదర్శనను పరిగణలోకి తీసుకుంటూ చేపట్టనున్న ఓటింగ్ ప్రక్రియ అక్టోబర్ 11 వరకు కొనసాగనుంది.

వేరే వ్యూహాలు అవసరం లేదు

బంగ్లాతో సిరీస్‌పై రోహిత్‌శర్మ వ్యాఖ్య

చెన్నై: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ కోసం తమకు ప్రత్యేకమైన వ్యూహాలు ఏం అవసరం లేదని టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ స్పష్టం చేశాడు. మిగతా జట్ల లాగే బంగ్లాను ప్రత్యర్థిగా ఎదుర్కొంటామని అన్నాడు. తొలి టెస్టు పోరు కోసం సిద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా భేటీలో రోహిత్ పలు అంశాలపై మాట్లాడాడు. 'ప్రతీ జట్టు భారత్‌ను ఓడించాలనుకుంటున్నది. తద్వారా ఘనత సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ ఉత్సాహాన్ని వాళ్లు అస్వాదించని. కానీ మా వరకు మ్యాచ్‌లు ఎలా గెలువాలన్నదే దానిపై మా దృష్టంతా. మా గురించి ప్రత్యర్థి ఏం ఆలోచిస్తుందన్న దానిపై మేము ఆలోచించం. ఇప్పటికే ప్రపంచంలోఇని ప్రతీ జట్టుతో భారత్ మ్యాచ్‌లు ఆడింది. ఇప్పటికిప్పుడు బంగ్లా కోసం ప్రత్యేకమైన వ్యూహం అవసరం లేదు. కొంతమంది కొత్త క్రికెటర్లు బాగా రాణిస్తున్నారు. వారిని ఎలా ఎదుర్కొవాలనే దానిపై మా గేమ్‌ప్లాన్ మాకుంది. కీలకమైన బౌలర్ల పని ఒత్తిడిని నిరంతరం పరిశీలిస్తూనే ఉంటాం. రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి కల్పిస్తాం. టెస్టు సిరీస్‌లకు ముందు దులీప్ ట్రోఫీ ఏర్పాటు చేయడం బాగుంది. దీని ద్వారా చాలా మంది క్రికెటర్లకు మంచి మ్యాచ్ ప్రాక్టీస్ దొరికింది' అని అన్నాడు.

సిద్ధార్థ్ సెంచరీ

ఫ్రీడమ్ అకాడమీ టీమ్ భారీ గెలుపు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నల్లగొండ ఫ్రీడమ్ అకాడమీ టీమ్ ఓపెనర్లు సిద్ధార్థ్ (121), సూర్య(86) విజృంభణతో ఎమ్మెస్కే రాకెట్స్ జట్టుపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో జరిగిన వన్డే మ్యాచ్‌లో మొదట ఎమ్మెస్కే టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో నక్ష్(52), హర్ష్(61) అర్ధసెంచరీలతో 260/5 స్కోరు చేసింది. లక్ష్యఛేదనలో సిద్ధార్థ్, సూర్య అదరగొట్టడంతో ఫ్రీడమ్ జట్టు 43.1 ఓవర్లలో 262/1 స్కోరు చేసింది. సెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సిద్ధార్థ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆసియా విజేత భారత్

ఫైనల్లో చైనాపై విజయం.. భారత్ ఖాతాలో ఐదో టైటిల్.. ఆకట్టుకున్న ఆతిథ్య జట్టు పోరాటం.. ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీ

విశ్వక్రీడల్లో వరుసగా రెండోసారి కంచు మోత మోగించిన భారత హాకీ జట్టు ఆసియాలో తమకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. చైనా వేదికగా జరిగిన ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ వరుసగా రెండోసారి టైటిల్ దక్కించుకుంది. ఫైనల్‌లో 1-0తో చైనాను చిత్తు చేసి జయకేతనం ఎగురవేసింది. ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరిన చైనా.. తుదిపోరులో భారత్‌కు గట్టి పోటీనిచ్చినా ఆట ఆఖర్లో జుగ్‌రాజ్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోగలిగింది.

7
ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ చేసిన గోల్స్. యంగ్ జి జిహున్ (ద.కొరియా) 9 గోల్స్‌తో ప్రథమ స్థానంలో ఉన్నాడు.

హులన్‌బుయిర్ (చైనా): ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి జోరు మీదున్న భారత హాకీ జట్టు మరో మెగా టోర్నీలో సత్తాచాటింది. చైనా వేదికగా జరిగిన ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ) ఫైనల్‌లో భారత్.. 1-0తో చైనాను ఓడించి వరుసగా రెండోసారి, మొత్తంగా ఐదోసారి ఏసీటీని సొంతం చేసుకుంది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా ఫైనల్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు తుది పోరులో చైనా నుంచి గట్టి సవాలే ఎదురైనా జుగ్‌రాజ్ సింగ్ 51వ నిమిషంలో కొట్టిన గోల్‌తో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించి ప్రతి మ్యాచ్‌లోనూ గోల్ కొట్టిన హర్మన్‌ప్రీత్ ఫైనల్‌లో గోల్ చేయడంలో విఫలమైనా జుగ్‌రాజ్‌కు బంతిని అందించడంలో సఫలీకృతుడయ్యాడు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో పాకిస్థాన్.. 5-2తో దక్షిణ కొరియాను ఓడించి పరువు నిలుపుకుంది.

పోరాడిన చైనా..

భారత్‌తో పోల్చితే అంతగా అనుభవం లేని చైనాకు ఇది అంతర్జాతీయ స్థాయిలో రెండో ఫైనల్ (2006 ఆసియా క్రీడల్లో తొలిసారి ఫైనల్ చేరింది) మాత్రమే. కానీ సొంతగడ్డపై ప్రేక్షకుల మద్దతుతో ఆ జట్టు రెచ్చిపోయింది. తొలి మూడు క్వార్టర్స్‌లో మన ఆటగాళ్లు ఎంత ప్రయత్నించినా చైనా రక్షణ శ్రేణి గోల్ చేసే అవకాశమే ఇవ్వలేదు. లీగ్ దశలో భారత్‌కు (3-0)తో అలవోకగానే లొంగిన చైనా.. ఫైనల్‌లో మాత్రం హోరాహోరీగా పోరాడింది. ఆట ఆరంభంలో భారత ఆటగాడు రాజ్‌కుమార్ పాల్ గోల్ చేసేందుకు అవకాశం దక్కినా చైనా గోల్ కీపర్ వాంగ్ వీహవొ దానిని విజయవంతంగా అడ్డుకున్నాడు. 10వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ (పీసీ) అవకాశాన్నీ భారత్ సద్వినియోగం చేసుకోలేదు. తొలి క్వార్టర్ ముగియనుండగా చైనాకు వచ్చిన పీసీని భారత గోల్ కీపర్ కృషణ్ బహదూర్ పాఠక్ అడ్డుకున్నాడు. రెండో క్వార్టర్‌లోనూ దాదాపు ఇదే కథ నడిచింది. 'మెన్ ఇన్ బ్లూ' ఎదురుదాడికి చైనా దీటుగానే సమాధానమిచ్చింది.

జుగ్‌రాజ్ గోల్..

ఆట నాలుగో క్వార్టర్ దాకా గోల్ లేకుండా డ్రా దిశగా సాగుతున్న మ్యాచ్‌కు ఆఖర్లో హర్మన్‌ప్రీత్, జుగ్‌రాజ్ ఊపు తెచ్చారు. నాలుగో క్వార్టర్ 9వ నిమిషంలో చైనా డిఫెన్స్‌ను తప్పించుకుంటూ సర్కిల్‌లోకి వచ్చిన హర్మన్‌ప్రీత్.. గోల్‌పోస్ట్‌కు అత్యంత సమీపంలో ఉన్న జుగ్‌రాజ్‌కు బంతిని పాస్ చేశాడు. బంతిని అందుకున్న జుగ్‌రాజ్.. రెప్పపాటు వేగంతో దానిని గోల్‌పోస్ట్‌లోకి పంపించి తొలి గోల్ కొట్టడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక ఆఖర్లో చైనా గోల్‌కీపర్‌ను తప్పించి ఎక్స్‌ట్రా ఫీల్డర్‌తో గోల్ కోసం యత్నించినా ఫలితం దక్కలేదు. టోర్నీ ఆద్యంతం రాణించిన హర్మన్‌ప్రీత్ సింగ్ (7 గోల్స్)కు 'హీరో ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

5
మంగళవారం ముగిసిన టోర్నీ 8వ ఎడిషన్ కాగా ఇందులో భారత్ ఐదుసార్లు విజేత కాగా ఒకసారి రన్నరప్‌గా నిలిచింది.

ఏసీటీలో భారత్ ఆధిపత్యం

2011లో ప్రారంభించిన ఈ టోర్నీ తొలి ఎడిషన్‌లో విజేతగా నిలిచిన భారత్ 2012లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆ తర్వాత 2016, 2018లో బ్యాక్ టు బ్యాక్ టైటిల్స్ గెలిచింది. 2023, 2024లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మరోమారు తన ఉదారతను చాటుకున్నాడు. ముంబైలో ఈనెల 19న జరిగే 'గోధార్మిక్ ఆక్షన్' కోసం కోహ్లీ తాను సంతకం చేసిన జెర్సీతో పాటు క్యాప్‌ను సదరు సంస్థ ప్రతినిధికి అందజేశాడు. ఈ ఫొటోను కోహ్లీ ఫ్యాన్స్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అద్భుతమైన స్పందన కింగ్ కోహ్లీ అంటూ కామెట్లు చేస్తున్నారు. బంగ్లాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం విరాట్ సిద్ధమవుతున్నాడు.

చైనా జెండాలతో పాక్ ప్లేయర్లు

ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీలో పాకిస్థాన్ ప్లేయర్లు చైనాపై తమ ప్రేమను చాటుకున్నారు. మంగళవారం భారత్, చైనా మ్యాచ్ జరుగుతున్న సమయంలో స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న పాక్ ఆటగాళ్లు చైనా జెండాలు ఊపుతూ కనిపించారు. సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన దీనిపై ట్రోలింగ్ నడుస్తున్నది.

పురుషులతో సమానంగా..

మహిళలకూ ఈక్వల్ ప్రైజ్‌మనీ

ఐసీసీ కీలక నిర్ణయం

దుబాయ్: వచ్చే నెలలో దుబాయ్ వేదికగా జరుగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ముందు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐసీసీ నిర్వహించే టోర్నీలలో పురుషులతో సమానంగా మహిళలకూ ప్రైజ్ మనీ ఇవ్వనుంది. తదుపరి పొట్టి ప్రపంచకప్ ఎడిషన్ నుంచే ఇది అందుబాటులోకి రానుంది. అక్టోబర్ నుంచి జరుగబోయే మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో టైటిల్ గెలిచిన విజేతకు ప్రైజ్‌మనీగా 2.34 యూఎస్ మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.19 కోట్లు) దక్కనున్నాయి. గత ఎడిషన్‌తో పోల్చితే ఇది 134 శాతం అధికం. రన్నరప్‌గా నిలిచే జట్టుకు 1.17 యూఎస్ మిలియన్ డాలర్లు (రూ.9.8 కోట్లు) అందుతాయి. 2022లో టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియాకు 1 యూఎస్ మిలియన్ డాలర్ల (రూ.8.37 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కింది.

రజావత్ నిష్క్రమణ

చెంగ్డూ: భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రజావత్.. 13-21, 16-21తో బ్రియాన్ యంగ్ (కెనడా) చేతిలో పరాభవం పాలయ్యాడు. రజావత్ ఓడటంతో ఈ టోర్నీ మెన్స్ సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జి ఒక్కడే బరిలో మిగిలాడు.

అర్జున్‌కు 9 వికెట్లు

అదరగొట్టిన జూనియర్ టెండూల్కర్

ఆలూరు (కర్నాటక): భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఒకే మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టి అదరగొట్టాడు. కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ కె తిమ్మప్పయ్య మెమొరియల్ టోర్నమెంట్ 2024-25లో భాగంగా కేఎస్‌సీఏతో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ (9/87) విజృంభించాడు. గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్జున్ చెలరేగడంతో ఆ జట్టు 189 పరుగుల తేడాతో విజయం సాధించింది.

- తెలంగాణ సరిహద్దుల్లో పులుల సంచారం

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోగల పెన్‌గంగా నది పరీవాహక ప్రాంతంలో మంగళవారం ప్రయాణికులకు మూడు పులులు కనిపించాయి. తెలంగాణలోని అంతర్గాం, గుబిడిలకు ఆవల ఉన్న మహారాష్ట్ర, మంగి, సవర్గాం గ్రామాల మధ్య పెద్ద పులులు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ పులులు తరచూ తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చి వెళ్తుంటాయని మంగి గ్రామానికి చెందిన రైతులు ఓంకారం, రమేశ్ తెలిపారు.

సీఆర్‌డీలో రిటైర్డ్ అధికారి తిష్ట!

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్(సీఆర్‌డీ) కార్యాలయంలో ఓ రిటైర్డ్ అధికారి తిష్ట వేశాడు. ఆయన చెప్పిందే వేదం.. ఆయన చేసిందే రాజ్యాంగం అన్నట్టుగా వ్యవహారశైలి ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి గత మార్చి 12న సెర్ప్ ఉద్యోగులకు ఐఆర్ ఐదు శాతం వర్తింపచేస్తూ సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్వయంగా సంతకం చేసి ఆర్డర్ రిలీజ్ చేసినప్పటికీ.. సీఆర్‌డీలో రిటైర్డ్ కన్సల్టెంట్ సుబ్బారావు ఉద్దేశపూర్వకంగా లేనిపోని అడ్డంకులు సృష్టించి ఆరు నెలల కాలయాపన చేశాడని సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకులు కుంట గంగాధర్ ఏపూరి నరసయ్య, జానయ్య, మహేశ్ సుదర్శన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. మంత్రి సీతక్క, శాఖ ముఖ్యకార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్యలకు ఫిర్యాదు చేయడంతో ఆరు నెలల ఆలస్యం తర్వాత ఈ నెలలో జమ చేశారని చెప్పారు. సెర్ప్ ఉద్యోగులకు రెండున్నర దశాబ్దాలుగా హక్కుగా అందుతున్న ప్రయోజనాలను ఆరు నెలలుగా అడ్డుకుంటున్న రిటైర్డ్ కన్సల్టెంట్ సుబ్బారావు తీరుకు నిరసనగా బుధవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు ప్రకటించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల ఉన్నప్పటికీ, రెండో వారం వరకు వేతనాలు రాకుండా రిటైర్డ్ అధికారి సుబ్బారావు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే చేతులు తడపాలని, లేకుంటే జీవితకాలం ఇలాగే సతాయిస్తానని యూనియన్‌లకు సంకేతాలు పంపుతున్నాడని మండిపడ్డారు. తాజాగా సెర్ప్ ఉద్యోగులకు వస్తున్న ఈపీఎఫ్‌ను సగానికి సగం కోత విధించేలా సీఆర్‌డీ నుంచి సెర్ప్‌కు మెమో జారీ చేయించాడని ఆరోపించారు. ఈ రిటైర్డ్ అధికారి చేష్టలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3974 సెర్ప్ ఉద్యోగులు విసిగి వేసారి పోయారని, బుధవారం అన్ని జిల్లాల యూనియన్ నాయకులు, సభ్యులు, సెర్ప్ ఉద్యోగులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకులు ప్రకటించారు. సెర్ప్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి సీఈవోకి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి రిటైర్డ్ కన్సల్టెంట్‌పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అప్పటికీ అతని వైఖరిలో మార్పు రాకపోతే నేరుగా మంత్రికి ఫిర్యాదు చేస్తామని, ఈ ఉద్యోగిని తొలగించి కఠినచర్యలు తీసుకునే వరకు నిరవధిక నిరసన చేపడతామని హెచ్చరించారు.

- మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో ఫ్లవర్ పక్షి

మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో సీజనల్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీరామ్ ఆదిత్య సోమవారం టిబెటన్ ఇసుక ఫ్లవర్ పక్షిని కనుగొన్నారు. వికారాబాద్ జిల్లా యెంకటాల వద్ద మరో పక్షి సాబెల్లిన్ వీటర్‌ను రాజశేఖర్ ముద్దం గుర్తించారు. నర్సాపూర్‌లో ఏషియన్ బ్రౌన్ ఫ్లై క్యాచర్‌ను ప్రముఖ వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ శ్రీరామ్‌రెడ్డి తన కెమెరాలో బంధించారు. ఇప్పటివరకు 280 పక్షిజాతులు తెలంగాణకు వలస వచ్చినట్టు తెలిపారు. ఈ పక్షులు చలికాలంలోనే వలస వస్తాయని, తర్వాత స్వస్థలాలకు చేరుకుంటాయని చెప్పారు.

జింబాబ్వే, నమీబియాలో కరువు రక్కసి

హరారే, సెప్టెంబర్ 17: కొన్ని దక్షిణ ఆఫ్రికా దేశాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడటంతో ప్రజలు క్షుద్బాధ భరించ లేక ఆకలి కేకలు వేస్తున్నారు. జింబాబ్వే, నమీబియా దేశాల్లో ఇలాంటి దయనీయ పరిస్థితులు ఉండటంతో ఆ ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి. ఆ దేశంలోని వందలాది ఏనుగులు, ఇతర అడవి జంతువులను వధించి ఆకలితో అలమటిస్తున్న పౌరులకు వాటి మాంసాన్ని ఆహారంగా అందించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్టు సోమవారం ప్రకటించాయి. జింబాబ్వేలో 200 ఏనుగులను చంపి వాటి మాంసాన్ని అన్నార్థులకు పంపిణీ చేయనున్నట్టు ప్రకటించగా, తమ దేశంలోని 83 ఏనుగులు సహా 700 అడవి జంతువులను హతమార్చాలని నిర్ణయించినట్టు నమీబియా తెలిపింది. దీనిపై జింబాబ్వే నేషనల్ పార్క్స్ అండ్ వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ అధికారి థినాషే ఫరావో మాట్లాడుతూ అవసరమైన జాతుల వారు ఏనుగులు వేటాడటానికి అనుమతులు ఇచ్చేశామని, కొన్నింటిని తాము చంపి వారికి అప్పగిస్తామని చెప్పారు.

ఎన్‌సీబీ డీజీగా అనురాగ్ గార్గ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: బీఎస్ఎఫ్ అదనపు డీజీగా ఉన్న ఐపీఎస్ అధికారి అనురాగ్ గార్గ్.. 'నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో' (ఎన్‌సీబీ) నూతన డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. కేంద్ర హోంశాఖ మంగళవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. హిమాచల్ ప్రదేశ్ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన అనురాగ్ గార్గ్ ఎంపికను క్యాబినెట్ కమిటీ ఆమోదించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 మే 23 వరకు లేదా తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఎన్‌సీబీ డీజీగా కొనసాగుతారని కేంద్రం పేర్కొన్నది. అఖిల భారత స్థాయిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, చట్ట విరుద్ధమైన పదార్థాల వినియోగాన్ని అడ్డుకోవటంలో ఎన్‌సీబీ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తుంది. స్మగ్లింగ్ కార్యకలాపాలను అడ్డుకునేందుకు దేశ సరిహద్దుల్లోనూ నిఘా కార్యకలాపాలను చేపడుతుంది.

ట్రూడో రాజీనామాకు ఒత్తిడి?

టొరంటో, సెప్టెంబర్ 17: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వరుసగా రెండో ఉప ఎన్నికలోనూ ఎదురుదెబ్బ తగిలింది. అధికార లిబరల్ పార్టీ మాంట్రియల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. మంగళవారం వెలువడిన ఈ ఫలితాలతో జస్టిన్ ప్రధాన పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి రావచ్చునని భావిస్తున్నారు. లాసల్-ఎమర్డ్-వెర్డున్ ఉప ఎన్నికలలో లిబరల్ అభ్యర్థి లారా పాలెస్తినీ ఓటమి చెందారు. ఆయనపై క్యుబియోకిస్ అభ్యర్థి లూయిస్ ఫిలిప్పే విజయం సాధించారు. తొమ్మిదేండ్లుగా పదవిలో ఉన్న ట్రూడో ప్రాభవం ఇటీవలి కాలంలో మసకబారుతూ వస్తున్నది. 2025 అక్టోబర్‌లో జరిగే ఎన్నికల్లో తానే నేతృత్వం వహిస్తానని ట్రూడో పట్టుబడుతూ వస్తున్నారు. అయితే ఆయన నాయకత్వాన్ని మార్చాలంటూ సొంత పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు.